సాక్షి అనంతపురం

బుధవారం । 25 । జూన్ । 2025



చీనీ టన్ను రూ.29,100

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.29,100 పలికాయి.



యంత్ర సాయమేదీ?

అడిగిన ప్రతి రైతుకూ యంత్ర సాయం చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆచరణలో మాత్రం చేతులెత్తేసింది. 8లో

గరిష్టం/కనిష్టం

34.4°/23.8°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లకు (ఎస్‌డబ్ల్యూపీసీ) సంబంధించిన షెడ్ల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. పంచాయతీ సెక్టార్, ఇతర అంశాలపై కలెక్టర్ మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 526 ఎస్‌డబ్ల్యూపీసీలు ఉండగా 72 చోట్ల విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదన్నారు. 10 చోట్ల నీటి సరఫరా లేదని, 8 చోట్ల రోడ్డు కనెక్టివిటీ పనులు పెండింగ్ ఉన్నాయన్నారు. వీటినైంత త్వరగా ఆ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్‌డబ్ల్యూపీసీ లేని గ్రామ పంచాయతీల్లో వాటిని ఏర్పాటు చేయాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు, గ్రీన్ గార్డులకు డబ్బులు పూర్తిగా చెల్లించాలని ఆదేశించారు. షెడ్లలో చెత్త సేకరణ వాహనాలు, వర్మీ బెడ్డింగ్, ఉత్పత్తి, అమ్మకాలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. సచివాలయాల అంశాలకు సంబంధించి మన మిత్ర క్యాంపెయిన్‌లో హౌస్‌హోల్డ్ పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని సూచించారు.

రేపటి నుంచి జీవాలకు టీకాలు

అనంతపురం అగ్రికల్చర్: గొర్రెలు, మేకలకు గురువారం నుంచి ఉచితంగా టీకాలు (వ్యాక్సినేషన్) వేసే కార్యక్రమం మొదలవుతుందని పశుసంవర్ధక శాఖ రెండు జిల్లాల జేడీలు డాక్టర్ జీపీ వెంకటస్వామి, డాక్టర్ జి.శుభదాస్, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం (ఏడీ డీఎల్) ఏడీ డాక్టర్ రవిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నట్టలు(డీవార్మింగ్), నీలినాలుక వ్యాధి (బ్లూటంగ్), థైలేరియాసిస్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 49 లక్షలు గొర్రెలు, 9 లక్షల మేకలు... మొత్తంగా 58 లక్షల జీవాలకు టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఆర్‌ఎస్‌కేల వేదికగా శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాక్సినేషన్ చేపట్టడానికి పారాస్టాఫ్‌తో బృందాలు ఏర్పాటు చేశామన్నారు. మూడు వ్యాధులకు సంబంధించి అవసరమైన మందులు ఇప్పటికే పశువుల ఆస్పత్రులకు చేర్చామన్నారు. జులై 10 వరకు వ్యాక్సినేషన్ కార్యక్రమం సాగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు.

వక్ఫ్ భూములకు కౌలు వేలం

అనంతపురం రూరల్: వక్ఫ్ బోర్డుకు సంబంధించిన భూముల సాగుకు కౌలు వేలం నిర్వహించనున్నారు.ఈ మేరకు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి రామసుబ్బారెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గుంతకల్లులోని హజరత్‌సయ్యద్, అక్బర్ ఉర్ఫ్ మస్తాన్‌వలి దర్గాలకు చెందిన సర్వే నంబర్ 132–ఏలో 7.34 ఎకరాలు, సర్వే నంబర్ 132–సీలో 28.74 ఎకరాలతో పాటు, బొమ్మనహాళ్ మండలం గోవిందవాడలోని సర్వే నంబర్ 209లోని 25.30 ఎకరాలను కౌలుకు సాగు చేసేందుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 28న జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయంలో నిర్వహించే వేలం పాటలో పాల్గొనవచ్చు. వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా రూ.10 వేల ధరావత్తును చెల్లించాలి. పూర్తి వివరాలకు 99666 47586లో సంప్రదించవచ్చు.

తారస్థాయికి తాగుడు

ఎక్కడ పడితే అక్కడే కిక్కు

- ఉమ్మడి జిల్లాలో రూ.1,300 కోట్లకు చేరువలో మద్యం అమ్మకాలు
- నెలకు సగటున రూ.145 కోట్ల విలువైన మద్యం తాగుతున్నట్టు అంచనా
- 9 మాసాల్లో 1.60 కోట్ల లీటర్ల మద్యం వినియోగం
- మరో 60 లక్షల బీర్ల సేవనం
- పర్మిట్‌రూములు, బెల్టుషాపులతో మత్తులో జోగుతున్న సామాన్యులు



తాడిపత్రిలో ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఎదురుగా మద్యం దుకాణం పక్కనే పర్మిట్ రూము

అనంతపురం జిల్లాలో గత 9 మాసాల్లో మద్యం అమ్మకాలు ఇలా..

మద్యం అమ్మకం (లీటర్లలో)

99,12,006

విలువ

రూ. 792,12,78,746

శ్రీ సత్యసాయి జిల్లాలో ..

మద్యం అమ్మకం (లీటర్లలో)

61,58,430

విలువ

రూ. 477,98,89,352



అనంతపురంలోని తపోవనం నుంచి నారాయణపురం మార్గంలో దారి పక్కనే వైన్‌షాపు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: బెల్టుషాపుల బెండు తీసే వారు కరువయ్యారు. పర్మిట్ల రూముల వైపు అసలు చూడడమే లేదు. 'పచ్చ' నేతలవే మద్యం షాపులు కావడంతో నిబంధనలు గాలికి పోయాయి. ఏ సమయంలోనైనా మద్యం దొరుకుతోంది. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లా మద్యం మత్తులో జోగుతోంది. మద్యం వినియోగం రోజు రోజుకూ పెరుగుతోంది తప్ప తగ్గడం లేదు.

సామాన్యులే సమిధలు..

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో దాదాపు అన్ని చోట్లా ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే మద్యం షాపుల నిర్వహణ జరుగుతున్న విషయం తెలిసిందే. దీంతో అమ్మకాలు ఎలా పెంచాలా అన్న కోణంలో ఇష్టారాజ్యంగా నిబంధనలకు తిలోదకాలిచ్చారు.మద్యం విచ్చలవిడిగా దొరుకుతుండటంతో గడిచిన 9 మాసాల్లో రెండు జిల్లాల్లో 1.60 కోట్ల లీటర్ల మద్యం తాగినట్టు తాజా లెక్కల్లో తేలింది. దీన్నిబట్టి సామాన్యులు రోజువారీ మద్యం కోసం ఎంత ఖర్చు చేస్తున్నారో అంచనా వేయొచ్చు.

ఎక్కడ చూసినా బెల్టుషాపులు

రెండు జిల్లాల్లో 200 వరకు మద్యం షాపులుంటే 2 వేలకు పైగా బెల్టు షాపులు ఉండటం గమనార్హం. దీంతో కూరగాయల షాపుల కంటే మద్యం షాపులే ఎక్కువగా ఉన్నట్టు తేలింది. చిన్న చిన్న గ్రామాల్లో సైతం తెలుగు తమ్ముళ్ల ఆధ్వర్యంలో రెండు, మూడు బెల్టుషాపులు నడుస్తున్నాయి. ఇక అర్బన్ ప్రాంతాల్లో వైన్‌షాప్‌ల పక్కనే అనధికార పర్మిట్ రూములు వెలిశాయి. దీంతో మద్యం లభ్యత పెరిగి విచ్చలవిడిగా వినియోగం అవుతున్నట్టు తెలుస్తోంది. రోజుకు ఉమ్మడి జిల్లాలో 60 వేల లీటర్ల మద్యం తాగుతున్నారని అంచనా. ఇక.. గడిచిన 9 మాసాల్లో 60 లక్షల బీర్లు తాగారు.

ఆఫర్లు పెట్టి మరీ..

మద్య నియంత్రణ గురించి పట్టించుకోకపోవడం, వైన్ షాపుల పక్కనే పర్మిట్ రూములు ఉండటంతో తాగినోడికి తాగినంత చందంగా మారింది.గతంలో బహిరంగ మద్యపానంపై 'సెబ్' ఉక్కుపాదం మోపేది. ఇప్పుడా పరిస్థితి లేదు. ధాబాలు, హోటళ్లు, టీకొట్లలో కూడా తాగే వెసులుబాటు ఉండటంతో మద్యం వినియోగానికి అడ్డూ అదుపు లేకుండా పోయింది. కొన్ని చోట్ల భోజన ఆఫర్లు పెట్టిమరీ మద్యం సేల్స్ పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. హిందూపురం, కదిరి, తాడిపత్రి ప్రాంతాల్లో వేళాపాళా లేకుండా మద్యం అమ్ముతున్నట్టు తెలుస్తోంది.



అనంతపురం రంగస్వామి నగర్‌లో మద్యం దుకాణం వద్దనే మత్తులో పడిపోయిన ఓ వ్యక్తి

'తమ్ముళ్ల' బాహాబాహీ

- శింగనమల మండల డీలర్ల సంఘం అధ్యక్షుడి ఎన్నికలో ఉద్రిక్తత



శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో తన్నుకునేందుకు సిద్ధమైన టీడీపీ నాయకులు

శింగనమల: మండల ప్రభుత్వ చౌకధాన్యపు డిపో డీలర్ల సంఘం అధ్యక్షుడి ఎన్నికలో టీడీపీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి తన్నుకునేందుకు సిద్ధమయ్యారు. శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శింగనమల మండలంలో 45 ప్రభుత్వ చౌక ధాన్యపు డిపో డీలర్లు ఉండగా.. డీలర్ల సంఘం అధ్యక్షుడిగా ఎవరిని ఎన్నుకోవాలనే అంశంపై వారం రోజులుగా టీడీపీ నాయకులు తీవ్ర స్థాయిలో చర్చించుకున్నారు. ఈ క్రమంలో సీనియర్ నాయకులందరూ సి.బండమీద పల్లికి చెందిన చెన్నయ్య పేరును ప్రతిపాదించగా, యువ నాయకులు శింగనమలకు చెందిన మసూదువలికి మద్దతు తెలిపారు. తహసీల్దార్ శేషారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్, సీఎస్‌డీటీ చంద్రకళ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల డీలర్ల సమావేశంలో డీలర్ల సంఘం అధ్యక్షుడి ఎన్నిక చేపట్టారు. సమావేశానికి డీలర్లతో పాటు టీడీపీకి చెందిన సీనియర్, జూనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తమకు చెప్పిందని సీనియర్లు, కాదు తమకే చెప్పిందని జూనియర్లు వాగ్వాదానికి దిగారు. ఒకానొక దశలో పరిస్థితి చేజారి నాయకులు తన్నుకునేందుకు సిద్ధమయ్యారు. తహసీల్దార్ శేషారెడ్డి, ఎస్‌ఐ విజయకుమార్ ఇరువర్గాలను ప్రాధేయపడి ఎమ్మెల్యే చెప్పిన వారికే అధ్యక్ష స్థానం కేటాయిస్తామని తెలపడంతో వివాదం సద్దుమణిగింది.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డీఆర్ఎం

గుత్తి: ప్రస్తుతం ప్రపంచమంతా కంప్యూటర్ చుట్టూ తిరుగుతోందని, సాంకేతికతను అందిపుచ్చుకుంటే సులువుగా మంచి భవిష్యత్తు అందుతుందని గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. గుత్తిలోని కోట ఉన్నత పాఠశాలలో వెబ్ టెక్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను మంగళవారం డీఆర్ఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ జ్ఞానం ఉంటే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉంటాయన్నారు. రోజూ కనీసం గంట పాటైనా సాధన చేయాలన్నారు. అనంతరం డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి, వెబ్ టెక్ కంపెనీ ప్రతినిధి రాజీవ్, సీనియర్ డీఎంఈ ప్రమోద్, ఎంఈఓ రవి నాయక్, హెచ్ఎం సుబహాన్ మాట్లాడుతూ కంప్యూటర్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, గుంతకల్లు సీనియర్ డీఎంఈ రామాచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

- కాగా, గుత్తి ఆర్ఎస్‌లో టెన్నిస్ కోర్టును డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా ప్రారంభించారు. గుత్తి కోటను సందర్శించారు. డీజిల్‌షెడ్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో గుత్తి, గుంతకల్లు సీనియర్ డీఎంఈలు ప్రమోద్, మంగాచారి, రైల్వే ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ నేత చంద్ర పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు రేపటి నుంచి రేషన్ పంపిణీ

అనంతపురం అర్బన్: వృద్ధులు, దివ్యాంగులు, నిస్సహాయ స్థితిలో ఉన్నవారికి జూలై నెలకు సంబంధించి రేషన్ ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు ఇంటివద్దనే పంపిణీ చేస్తారని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. బియ్యం కార్డు కలిగిన వయసు 65 ఏళ్ల పైబడిన వృద్ధులు జిల్లాలో 58,506 మంది ఉన్నారని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, నిస్సహాయ స్థితిలో ఉన్నవారు రేషన్ కోసం చౌక దుకాణాల వద్దకు రావాల్సిన అవసరం లేదన్నారు. డీలర్ లేదా వీఆర్ఓ ఇంటి వద్దకు వచ్చి రేషన్ ఎప్పుడు ఇస్తారనే విషయాన్ని ముందుగానే తెలియజేస్తారని తెలిపారు. జాబితా ప్రకారం డీలరు వారి ఇంటి వద్దకు వెళ్లి రేషన్ అందించాలని, అలా ఇవ్వని డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిత్యావసర సరుకుల పంపిణీలో సమస్యలు ఉంటే కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ 8500292992 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

'ఎంటీఎస్' కౌన్సెలింగ్ మళ్లీ వాయిదా

- దూర ప్రాంతాలకు వెళ్లేందుకు టీచర్ల ససేమిరా..



ఆర్జేడీ శామ్యూల్‌తో మాట్లాడుతున్న ఎంటీఎస్ టీచర్లు



బదిలీల్లో కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆందోళన చేస్తున్న ఎంటీఎస్ టీచర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: ఎంటీఎస్ టీచర్ల బదిలీ కౌన్సెలింగ్ మళ్లీ వాయిదా పడింది. మూడు రోజుల క్రితం జరిగిన కౌన్సెలింగ్‌ను బాయ్‌కాట్ చేసిన టీచర్లు.. రెండోమారు మంగళవారం జరపాలని చూసిన కౌన్సెలింగ్‌లోనూ పాల్గొనకుండా బాయ్‌కాట్ చేయడం విశేషం. స్థానిక సైన్స్ సెంటర్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కావాల్సిన కౌన్సెలింగ్‌ను ఎంటీఎస్ టీచర్లు అడ్డుకున్నారు. తమపట్ల కూటమి ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందంటూ వాపోయారు. తక్కువ వేతనంతో పని చేస్తున్నామని, డీఏ, హెచ్ఆర్ఏ సదుపాయం ఉండదని, పైగా చాలామంది రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్నారన్నారు. ఇలాంటి వారందరికీ జిల్లా సరిహద్దు మండలాల్లో కనీసం రవాణా సదుపాయం లేని స్కూళ్లకు కేటాయిస్తే ఎలా పోవాలి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నియర్ బై రెసిడెంట్' ఉత్తర్వులు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మొండిగా కౌన్సెలింగ్ చేసే ప్రయత్నం

మరోవైపు విద్యాశాఖ అధికారులు మొండిగా కౌన్సెలింగ్ చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఈ క్రమంలో సీనియార్టీ జాబితాలో ఉన్న పేర్లను పిలుస్తూ లోపలికి వచ్చి నచ్చిన స్థానాలు ఎన్నుకోవాలి.. లేదంటే బలవతంగా స్థానాలు కేటాయించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో ఎంటీఎస్ టీచర్లు తిరగబడ్డారు. మైకులో అనౌన్స్ చేస్తున్న టీచరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లోపలికి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. అయితే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంటీఎస్ టీచర్లు పెద్దస్థాయిలో తిరగబడడంతో కౌన్సెలింగ్ ప్రక్రియను అంతటితో ఆపేశారు.

ఆర్జేడీ నోటా పాత మాటే

రీజినల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ కౌన్సెలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. ఆయనతో పాటు డీఈఓ ప్రసాద్‌బాబును ఎంటీఎస్ టీచర్లు చుట్టుముట్టారు. ఈ క్రమంలో ఆర్జేడీ నోటి నుంచి కూడా పాతమాటే వచ్చింది. విద్యార్థులకు సరిపడా పోస్టులు మాత్రమే ఉన్నాయి.. అంతకు మించి చూపించడం సాధ్యం కాదంటూ తెగేసి చెప్పారు. దీంతో ఎంటీఎస్ టీచర్లు ఆర్జేడీ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. 'మా జీవితాలతో ఆడుకోవద్దండి. ఇన్ని ఇబ్బందులు పెట్టే బదులు కాసింత విషం ఇచ్చి చంపండి' అంటూ వాపోయారు. సహకరించాలని పలుమార్లు ఆర్జేడీ వేడుకున్నా... టీచర్లు అంగీకరించలేదు. చివరకు రాత్రి 8 గంటల సమయంలో బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించి అందరూ కౌన్సెలింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోయారు.

చౌక బియ్యం.. అక్రమార్కుల పరం!

- దర్జాగా నల్లబజారుకు రేషన్ బియ్యం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- కూటమి నాయకుల కనుసన్నల్లోనే దందా

రాయదుర్గం: జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోంది. పేదల బియ్యంతో ముఠా వ్యాపారం చేస్తోంది. ఊరూరా ఇంటింటికీ వెళ్లి బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ సామాన్యుల నోటి కాడ కూడు లాగేసుకుంటున్నారు. ప్రతి నెలా 1వ తేదీ దాటగానే బియ్యం కొనుగోలు చేస్తూ ఆటోల ద్వారా ఓ చోటకు చేర్చి రాత్రికి రాత్రి సరిహద్దులు దాటిస్తున్నారు. కణేకల్లులో కూటమి నాయకులు ముగ్గురు సిండికేట్‌గా ఏర్పడి దందాకు తెరతీసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి తదితర ప్రాంతాల్లో సేకరించిన బియ్యాన్ని బళ్లారి–బెంగళూరు జాతీయ రహదారిపై డీ హీరేహాళ్ మండలం గుండా అక్రమ రవాణ చేస్తున్నారు.

అధికారుల అలసత్వంతోనే..

ప్రతి నెలా వస్తున్న బియ్యం కోటాలో సగానికి పైగా పక్కదారి పట్టించేలా వ్యాపారులు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిసింది. ఇప్పటి దాకా పట్టుబడిన వారిలో చిరు వ్యాపారులే అధికంగా ఉండడం గమనార్హం. బడా వ్యాపారులు మాత్రం సరుకు అమ్ముకుని రూ.లక్షలు గడిస్తున్నారు. వీరికి కూటమి నాయకులు కొందరు అండగా నిలుస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కర్ణాటక రాష్ట్రంలోని చెళ్లకెర, చిత్రదుర్గం, తుమకూరు, బెంగళూరు తదితర ప్రాంతాల్లోని కోళ్ల ఫారాలకు బియ్యం తరలిస్తున్నట్టు తెలుస్తోంది. మరికొందరు రీ సైక్లింగ్ చేసి తిరిగి సోనామసూరి పేరిట అమాయక ప్రజలకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నట్టు సమాచారం. అధికారుల అలసత్వంతోనే బియ్యం ముఠా రెచ్చిపోతోందనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా నిఘా ఉంచి రేషన్ బియ్యం తరలిపోకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.డీ హీరేహాళ్ టోల్ వద్ద తనిఖీలు నిర్వహిస్తే చీకటి వ్యాపారం గుట్టు రట్టవుతుందని పలువురు పేర్కొంటున్నారు.

• ఈ నెల 19న..

డీ హీరేహాళ్ సమీపాన జాతీయ రహదారి మీదుగా కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్న 134 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి కేసు నమోదు చేశారు.

• మే నెల 14

బొమ్మనహాళ్ మండలం మీదుగా కర్ణాటక రాష్ట్రానికి బొలేరో వాహనంలో తరలిస్తున్న 48 బస్తాల బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి బండూరు గ్రామ సమీపాన పట్టుకున్నారు. తరలిస్తున్న వారిపై కేసులు నమోదుచేశారు. ఇవే కాదు.. జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట చౌక బియ్యం పట్టుబడుతోంది.



డీ హీరేహాళ్‌లో చౌక బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్, రెవెన్యూ అధికారులు (ఫైల్)

బియ్యం అమ్మితే కార్డులు రద్దుచేస్తాం

పేదల ఆకలి తీర్చేందుకు ప్రతి నెలా చౌక దుకాణాల ద్వారా అందించే బియ్యాన్ని పక్కదారి పట్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. చౌక బియ్యం అమ్ముకున్నట్టు తెలిస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రేషన్‌కార్డు రద్దుకు సిఫార్సు చేస్తాం. అవసరం లేని వారు ఎట్టి పరిస్థితుల్లో బియ్యం తీసుకోవద్దు.

– వసంతబాబు, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

అసలైన సూత్రధారుల గుట్టు విప్పాలి

- ఈ స్టాంప్ కుంభకోణంపై సీబీఐ, ఈడీతో విచారణ చేయించాలి
- కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ నేతల డిమాండ్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం: ఈ–స్టాంప్‌ల కుంభకోణంపై సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)తో విచారణ జరిపించి, అసలైన సూత్రధారుల గుట్టు విప్పాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ మున్సిపల్ విభాగం కన్వీనర్ ఐ.సుధీర్, మండల కన్వీనర్ గోళ్ల సూర్యనారాయణ, అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి రామాంజినేయులు యాదవ్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. 25 ఏళ్ల క్రితం కూడా టీడీపీ హయాంలో స్టాంప్‌ల కుంభకోణం జరిగిందని గుర్తుచేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే అవినీతికి హద్దు ఉండదన్నారు. కళ్యాణదుర్గంలో మీ–సేవ నిర్వాహకుడిని పావుగా వాడుకుని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కొన్ని కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారని తెలిపారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ– స్టాంప్ కుంభకోణంపై నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విచారణ జరిపించాలన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే వందల కోట్ల ఈ– స్టాంప్‌ల కుంభకోణం బయటకు రావడం ఆశ్చర్యకరమన్నారు. దీని వెనుక పెద్దల హస్తం ఉందని,వారందరినీ బయటకు లాగాలన్నారు. కేవలం కళ్యాణదుర్గంలోనే కుంభకోణం జరిగి ఉండదని, ఎస్‌ఆర్‌సీ కన్‌స్ట్రక్షన్ వివిధ రాష్ట్రాల్లో కాంట్రాక్టు పనులు చేస్తోందని, అక్కడ కూడా ఇలాంటివి జరిగి ఉంటాయని ఆరోపించారు. ఎమ్మెల్యేకు సంబంధం లేదంటున్నప్పుడు నిజాయితీని నిరూపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.సమావేశంలో నాయకులు గణేష్, కౌన్సిలర్లు లక్ష్మన్న, పరమేశ్వరప్ప, కో ఆప్షన్ మారుతి, శ్రీకాంత్, షేక్షావలి, నాగరాజు, చరణ్, రమేష్, రాజు, నారాయణస్వామి, ప్రతాప్, జాకీర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

టీడీపీలో ఉలికిపాటు

స్టాంప్ డ్యూటీ చెల్లింపుల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని, తప్పుడు ఈ –స్టాంప్‌లతో బ్యాంకులు, ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వాలను మోసం చేసిన టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కంపెనీ కుంభకోణం బయటపడటంతో ఆ పార్టీ శ్రేణులు ఉలిక్కిపడ్డాయి. మీ సేవ నిర్వాహకుడు బాబుకు ఎమ్మెల్యే సపోర్ట్‌గా ఉంటూ కుంభకోణానికి సహకరించారనే అంశం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ అంశంపై సీబీఐ, ఈడీ తదితర దర్యాప్తు సంస్థలచే విచారణ చేయించాలని డిమాండ్లు పెరిగిపోవడం గమనార్హం.

క్లుప్తంగా

కొనసాగుతున్న సచివాలయ ఉద్యోగుల ధర్నా



డీఎంహెచ్ఓ కార్యాలయంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సచివాలయ ఉద్యోగులు

అనంతపురం మెడికల్: కూటమి ప్రభుత్వం చేపట్టిన అసంబద్ధ బదిలీలపై సచివాలయ ఉద్యోగుల్లో నిరసన పెల్లుబికుతోంది. రెండ్రోజులుగా సచివాలయ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టిన సచివాలయ ఉద్యోగులు మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ప్లకార్డులు ప్రదర్శించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నోషనల్ ఇంక్రిమెంట్స్ వెంటనే అందజేయాలని, బదిలీల్లో స్థానికంగా ఉండే వారికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సెలవు దినాల్లోనూ తమతో పనులు చేయించుకునే వైఖరి వీడాలన్నారు. బదిలీల పేరుతో ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. అనంతరం డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు లక్ష్మీనారాయణ, సుధాకర్, వరప్రసాద్, మహేష్ నాయక్, వినయ్, భగీరథ రెడ్డి, జైనబ్బీ, జ్యోతిలక్ష్మి, కుళ్లాయమ్మ, విమల, మౌలాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

గుత్తి రూరల్: మండలంలోని మాముడూరు గ్రామంలో వెలసిన రేవణదొడ్డి ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం వేకువజామున చోరీ జరిగింది. గ్రామ శివారులోని ఆలయానికి వేసిన తాళాన్ని బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు హుండీ తాళాలను ఇనుప రాడ్‌తో మెండి ధ్వంసం చేశారు. అందులోని సుమారు రూ.5వేల వరకూ ఉన్న నగదును అపహరించారు. మంగళవారం ఉదయం ఆలయానికి వెళ్లిన అర్చకుడు చోరీ విషయాన్ని గుర్తించి గ్రామస్తులకు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వృద్ధుడి బలవన్మరణం

రాప్తాడు: మండలంలోని గంగలకుంట సమీపంలో మంగళవారం ఉదయం 8 గంటలకు రైలు కింద పడి ఓ గుర్తు తెలియని ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ మేరకు ధర్మవరం రైల్వే పోలీసులు తెలిపారు. సుమారు 65 నుంచి 70 మధ్య వయస్సు గల వ్యక్తి తెలుగు రంగు చొక్కా, నలుపు రంగు డ్రాయర్, బ్రౌన్ కలర్ లుంగీ ధరించాడు. అతనికి ఎడమ కాలు లేదు. రెండు చేతులు కూడా అవిటిగా ఉన్నాయి. ఆచూకీ తెలిసిన వారు 95502 16049, 99513 25345 కు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు.

యంత్ర సాయమేదీ?

- ఇప్పటి వరకూ అడ్రస్ లేని కిసాన్ డ్రోన్లు
- వ్యవసాయ యంత్ర పరికరాలకు రూ.3 కోట్లు కూడా ఖర్చు చేయని కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.16.40 కోట్ల రాయితీతో సీహెచ్‌సీల ఏర్పాటు



సీహెచ్‌సీల కింద రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన ట్రాక్టర్లు (ఫైల్)

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అడుగడుగునా రైతులు మోసపోతూనే ఉన్నారు. ఏడాది పూర్తయినా ఎలాంటి సాయం చేయకుండా ప్రభుత్వ పెద్దలు దాటవేత ధోరణి అవలంబిస్తున్నారు. ఇప్పటికే అన్నదాత సుఖీభవ, ఇన్‌పుట్, ఇన్సూరెన్స్ కింద ఆర్థిక సాయం అందించకుండా ఎగ్గొట్టారు. మరోపక్క అడిగిన ప్రతి రైతుకూ వ్యవసాయ యంత్ర పరికరాలు పెద్ద ఎత్తున అందిస్తామని గొప్పగా చెప్పినా.. ఆచరణలో మాత్రమం చేతులెత్తేశారు. యాంత్రీకరణకు కేటాయించిన రూ.3 కోట్లు బడ్జెట్ కూడా వెచ్చించకుండా మిగిలించేశారు.

కనిపించని డ్రోన్లు

వ్యవసాయ యంత్ర పరికరాల వితరణకు సంబంధించి కాగితాల్లో 50 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించినా మార్కెట్ ధరలను బట్టి చూస్తే రైతుకు 20 శాతం కూడా రాయితీ దక్కే పరిస్థితి లేదు. మరోపక్క కిసాన్ డ్రోన్లు ఇస్తామంటూ ఏడాదిగా అదిగో ఇదిగో అంటూ ఊరిస్తున్నారు. ఇప్పటికీ ఆ డ్రోన్లు ఎక్కడున్నాయో అంతుచిక్కడం లేదు. తొలి విడత కింద 50 శాతం రాయితీతో ఆర్‌ఎస్‌కేలకు అనుబంధంగా 35 డ్రోన్లు మంజూరైనట్లు అధికారులు ప్రకటించారు. అయితే ఇది ఆచరణలోకి రాలేదు. డ్రోన్లు మంజూరు చేసిన తర్వాత క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి యుటిలైజేషన్ సర్టిఫికేషన్ ఇచ్చిన తర్వాత 50 శాతం రాయితీ విడుదల చేస్తామని మెలికపెట్టారు. దీంతో రైతుల్లో ఆసక్తి నశించింది. ఇప్పటికిపుడు రూ.5 లక్షలు చెల్లించడానికి రైతులు ముందుకు రాకపోవడంతో డ్రోన్ల కార్యాచరణ అడ్రస్ లేకుండా పోయింది.

అన్నదాతకు అండగా గత ప్రభుత్వం

గతంలో 2019–24 మధ్య అన్నదాతలకు అన్ని విధాలుగా అండగా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారు. రూ.50 కోట్లకు పైగా విలువ చేసే యంత్ర పరికరాలను అందజేశారు. ప్రతి ఆర్‌బీకేకు అనుబంధంగా కమ్యూనిటీ హైయరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ) పేరున రైతు గ్రూపులు ఏర్పాటు చేసి వారు కోరుకున్న ట్రాక్టర్లు, ఇతర ఆధునిక యంత్రపరికరాలు రెండు విడతలుగా అందించారు. తొలి విడతగా రూ.8.25 కోట్ల రాయితీ ఇచ్చి 219 సీహెచ్‌సీలు ఇవ్వగా, రెండో విడతగా మిగతా రూ.8.15 కోట్లు రాయితీ ఇచ్చి 230 సీహెచ్‌సీలు మంజూరు చేశారు. ఒక్కో సీహెచ్‌సీలో రూ.15 లక్షలు విలువ చేసే కోరుకున్న ట్రాక్టర్‌తో పాటు ఆధునిక పరికరాలకు 40 శాతంతో రూ.16.40 కోట్ల మేర రాయితీ వర్తింపజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు విశిష్ట సేవలందిస్తున్న ఆర్‌బీకేలను ఆర్‌ఎస్‌కేలుగా పేరు మార్చి నిర్వీర్యం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాయితీతో సూక్ష్మ సేద్యం పరికరాలు



మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి

గార్లదిన్నె: ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీతో సూక్ష్మ సేద్యం పరికరాలను అందజేస్తున్నట్లు ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి తెలిపారు. గార్లదిన్నె మండలం యర్రగుంట్ల, ముకుందాపురం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికు ముఖ్య అతిథిగా హాజరైన పీడీ రఘునాథరెడ్డి మాట్లాడుతూ 5 ఎకరాల వరకు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, 10 ఎకరాల వరకు భూమి ఉన్న ఇతర సామాజిక వర్గాలకు చెందిన రైతులకు 90 శాతం సబ్సిడీతో 10 ఎకరాలు పైబడి భూమి ఉన్న రైతులకు 50 శాతం సబ్సిడీతో డ్రిప్పు, స్ప్రింక్లర్లను అందజేస్తామన్నారు. సూక్ష్మ సేద్యం పరికరాలు అవసరమున్న రైతులు ఆర్‌ఎస్‌కేల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ విస్తరణాధికారి రామాంజనేయులు, మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ పాల్గొన్నారు.

సెక్టోరియల్ పోస్టుకు ఎస్జీటీలకూ అవకాశం

- ఎంఈఓలు, హెచ్‌ఎంలను అనర్హులంటూ ఉత్తర్వులు జారీ

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న సెక్టోరియల్ అధికారుల పోస్టుల భర్తీలో తొలిసారిగా సెకండరీ గ్రేడ్ టీచర్లకూ (ఎస్జీటీ) అవకాశం కల్పించారు. వీరితో పాటు స్కూల్ అసిస్టెంట్లు మాత్రమే అర్హులు. మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులను ఎట్టి పరిస్థితుల్లో తీసుకోవద్దంటూ విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లందరూ అర్హులేనని వెల్లడించారు.

ఏ పోస్టుకు ఎవరెవరు..

- అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ) పోస్టుకు కనీసం ఐదేళ్ల కేడర్ అనుభవం ఉన్న స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లయితే కనీసం 8 సంవత్సరాల సర్వీస్ ఉండాలి. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలు/సంస్థల నుంచి పీజీ పూర్తి చేసి ఉండాలి.
- అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (కన్నడ) పోస్టుకు కనీసం ఐదేళ్ల కేడర్ అనుభవం ఉన్న స్కూల్ అసిస్టెంట్లు, 8 ఏళ్ల సర్వీసు ఉన్న ఎస్జీటీలు అర్హులు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలు/సంస్థల నుంచి పీజీ పూర్తి చేసి ఉండాలి. ఎస్‌ఏలు ఇంటర్/డిగ్రీ/పీజీ స్థాయిలో తప్పనిసరిగా కన్నడ మాధ్యమంలో చదివి ఉండాలి. ఎస్జీటీలు పదోతరగతి/ఇంటర్/డిగ్రీ/పీజీ స్థాయిలో కన్నడ మాధ్యమంలో చదివి ఉండాలి.
- అసిస్టెంట్ ఆల్టర్నేటివ్ స్కూలింగ్ కోఆర్డినేటర్ (అసిస్టెంట్ అలెస్కో) పోస్టుకు కనీసం ఐదేళ్ల కేడర్ అనుభవం ఉన్న ఎస్‌ఏలు, 8 ఏళ్ల సర్వీసు ఉన్న ఎస్జీటీలు అర్హులు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలు/సంస్థల నుంచి పీజీ పూర్తి చేసి ఉండాలి.
- అసిస్టెంట్ ఐఈడీ కోఆర్డినేటర్ పోస్టుకు ఐదేళ్ల కేడర్ అనుభవం ఉన్న స్కూల్ అసిస్టెంట్లు అర్హులు. ఎస్జీటీలయితే కనీసం ఎనిమిదేళ్ల అనుభవం ఉండాలి. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలు/సంస్థల్లో జంతుశాస్త్రం/వృక్షశాస్త్రం/మనస్తత్వ శాస్త్రంలో పీజీ పూర్తి చేసి ఉండాలి. అలాగే బీఎడ్/డీఎడ్‌లో ప్రత్యేక విద్య చేసి ఉండాలి. లేదా 45/90 రోజుల ఫౌండేషన్ ప్రత్యేక విద్యలో కోర్సు చేసి ఉండాలి.
- అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీస్ (ఏఎస్ఓ) పోస్టుకు ఐదేళ్ల కేడర్ అనుభవం ఉన్న స్కూల్ అసిస్టెంట్లతో పాటు 8 ఏళ్ల సర్వీసు ఉన్న ఎస్జీటీలు అర్హులు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలు/సంస్థల్లో గణితం/గణాంకాలలో పీజీ పూర్తి చేసి ఉండాలి. కంప్యూటర్ కోర్సులో పీజీ చేసి ఉండాలి.

మామిడిలో యాజమాన్యం చేపట్టండి

- శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానశాఖ డీడీ చంద్రశేఖర్ సూచన



అనంతపురం అగ్రికల్చర్: మామిడి కోతలు పూర్తయిన అనంతరం సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానశాఖ డీడీ జి.చంద్రశేఖర్ సూచించారు. తోటల్లో కాయలన్నీ కోసిన తర్వాత ఒక నీటి తడి ఇచ్చి ఎండుపుల్లలు, పూతకాడలు, ఆకుగూళ్లను తొలగించాలన్నారు. చెట్టు మధ్య భాగంలో ఉన్న చిన్న కొమ్మలు, నాలుగు దిక్కులా సూర్యరశ్మిని అడ్డుకునే కొమ్మలను తొలగించి గాలీవెలుతురు ప్రసరించేలా కత్తిరించాలన్నారు. బాగా ముదిరిన పెద్ద చెట్లలో రంపం లేదా పవర్‌సాను ఉపయోగించి చెట్టు ఎత్తును తగ్గించాలన్నారు. అనంతరం కత్తిరించిన కొమ్మల చివర కాపర్ సంబంధిత శిలీంధ్రం లేదా కార్బండిజమ్‌ను పూయాలని తెలిపారు. తొలకరి సమయంలో చెట్టు మొదలు దగ్గరగా భూమిని దున్నడం లేదా పాదులు తవ్వి తిరగేయాలని తెలిపారు. జూన్, జూలై మాసంలో ఎకరాకు 10 కిలోలు జీలుగ లేదా 25 కిలోలు జనుము లాంటి పచ్చిరొట్ట పైర్లు వేసి 40 నుంచి 45 రోజుల సమయంలో భూమిలో కలియదున్నితే సేంద్రియ పదార్థం, భూసారం బాగా పెరుగుతుందన్నారు. ప్రతి చెట్టు పాదులో 100 కిలోల బాగా చివికిన పశువుల ఎరువు లేదా 10 కిలోలు వర్మికంపోస్టు వేయాలన్నారు. సిఫారసు చేసిన విధంగా ప్రతి చెట్టుకూ 1.7 కిలోల యూరియా, 1.1 కిలోల సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్, 1.15 కిలోల పొటాషియం సల్ఫేట్ లేదా మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఏడాదికి రెండు సార్లు అంటే జూన్–జూలై అలాగే అక్టోబర్–నవంబర్‌లో వేయాలన్నారు. కొత్త చిగుర్లు వచ్చే సమయంలో 5 గ్రాముల జింక్ సల్ఫేట్ , 2 గ్రాముల బోరాక్స్, 10 గ్రాముల యూరియా కలిపిన ద్రావణాన్ని ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకుంటే వచ్చే ఏడాది మంచి దిగుబడులు పొందవచ్చునని పేర్కొన్నారు.

పోక్సో కేసు నమోదు

బుక్కరాయసముద్రం: మండలంలోని గోవిందపల్లి పంచాయతీలో ఇద్దరు బాలురపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు, పుల్లయ్య తెలిపారు. వివరాలను మంగళవారం వారు వెల్లడించారు. రాఘవేంద్ర కాలనీలో 3వ తరగతి చదువుతున్న ఓ బాలుడిని అదే కాలనీకి చెందిన 13 ఏళ్ల వయస్సు కలిగిన ఇద్దరు బాలురు మాయ మాటలతో నిర్జన ప్రదేశంలోకి తీసుకెళ్లి లైంగికంగా వేధించారు. దీంతో బాధితుడు ఏడ్చుకుంటూ ఇంటికి చేరుకోవడంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం ఇద్దరు బాలురపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జీజీహెచ్‌లో మోసగాడి పట్టివేత

అనంతపురం మెడికల్: రోగుల అవసరాలను సొమ్ము చేసుకునే ప్రయత్నం చేసిన మోసగాడిని ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జీజీహెచ్) సిబ్బంది బంధించి, పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. బెళగుప్పకు చెందిన నీలమ్మ సర్జికల్ సమస్యతో బాధపడుతూ చికిత్స కోసం కొన్ని రోజులుగా జీజీహెచ్‌కు తిరుగుతోంది. ఈ క్రమంలో ఓపీ వద్ద నిరంజన్ అనే వ్యక్తి ఆమెతో పరిచయం పెంచుకుని వైద్య పరీక్షలు తక్కువ ఖర్చుతో చేయిస్తానంటూ రూ.2 వేలు తీసుకున్నాడు. మంగళవారం జీజీహెచ్‌కు వచ్చిన నీలమ్మను కలసి పూర్తి స్థాయి వైద్య పరీక్షలతో పాటు ఆపరేషన్ చేయించేలా చూస్తానని, ఇందుకు రూ.6 వేలు ఖర్చు అవుతుందని తెలిపాడు. దీంతో రూ.6 వేలు చెల్లించేందుకు నీలమ్మ కుటుంబసభ్యులు సిద్ధమయ్యారు. ఈ లోపు 'అపరిచిత వ్యక్తులను నమ్మరాదు. ఎవరికీ డబ్బులు ఇవ్వకూడదు' అంటూ సెక్యూరిటీ సిబ్బంది మైక్ ద్వారా అనౌన్స్ చేయడం విన్న నీలమ్మ, ఆమె కుటుంబసభ్యులు అప్రమత్తమయ్యారు. విషయాన్ని వెంటనే సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు. దీంతో సెక్యూరిటీ సూపర్‌వైజర్ నరేష్, సెక్యూరిటీ గార్డులు శోభారాణి, స్వరూప తదితరులు అక్కడే తచ్చాడుతున్న నిరంజన్‌ను బంధించి ఔట్‌పోస్టు పోలీసులకు అప్పగించారు. విచారణ అనంతరం రెండో పట్టణ పీఎస్‌కు తరలించారు.

'అనంత'లో యువకుడి హత్య



విగత జీవిగా పడి ఉన్న సిదానంద

అనంతపురం: నగరంలోని బళ్లారి బైపాస్‌లో ఉన్న అన్న క్యాంటీన్ వద్ద ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గార్లదిన్నె మండలం కోటంక గ్రామానికి చెందిన రామలింగ కుమారుడు జి. సిదానంద (28)కు అదే మండలం యర్రగుంట్ల గ్రామానికిచెందిన ఎర్రిస్వామి కుమార్తె శోభాతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. గార్లదిన్నెలో కాపురం ఉండేవారు. ఈ క్రమంలో పది నెలల క్రితం శోభ ఆత్మహత్య చేసుకుంది. ఆమెను ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో సిదానందను పోలీసులు అప్పట్లో అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపారు. రిమాండ్ నుంచి వచ్చిన అనంతరం అనంతపురంలోని పాతూరులో ఉన్న ఓ కిరాణా షాపులో సిదానంద పనిలోకి చేరాడు. రోజూ ఉదయం కోటంక నుంచి అనంతపురానికి వచ్చి వెళ్లేవాడు. మూడు రోజుల క్రితం అనంతపురానికి వచ్చిన సిదానంద ఆ తర్వాత ఇంటికి వెళ్లలేదు. మంగళవారం ఉదయం బళ్లారి బైపాస్ రోడ్డు వద్ద ఉన్న అన్న క్యాంటీన్ సమీపంలో అందరూ చూస్తుండగా దుండగులు సిదానంద తలపై బండరాయితో మోది హతమార్చారు. సమాచారం అందుకున్న నాల్గో పట్టణ పీఎస్ సీఐ జగదీష్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. హతుడి జేబులో లభ్యమైన గుర్తింపు కార్డు ఆధారంగా వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. హతుడి తమ్ముడు జి. దినేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, సిదానంద భార్య ఆత్మహత్య చేసుకున్న సమయంలో ఆమె కుటుంబసభ్యులు తీవ్ర ఆవేశానికి లోనవుతూ సిదానందను చంపుతామని బెదిరించినట్లు హతుడి కుటుంబసభ్యులు గుర్తు చేశారు. దీంతో శోభ కుటుంబసభ్యులా, లేదా ఇతర కారణాలతో మరెవ్వరైనా ఈ ఘాతుకానికి తెగబడ్డారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హత్య జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో దారుణానికి పాల్పడింది ఎవరనేది స్పష్టం కాలేదు.

జగనన్నను కలసిన ప్రవాసాంధ్రులు



వైఎస్ జగన్‌ను కలసిన ప్రవాసాంధ్రులు, చిత్రంలో ఆలూరు సాంబశివారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ప్రవాసాంధ్రులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిలో సుబ్బారెడ్డి(యూఎస్‌ఏ కన్వీనర్), ఇలియాజ్ (గల్ఫ్ కన్వీనర్), ఆర్‌బీఎస్ రెడ్డి (డల్లాస్), శేఖర్‌రెడ్డి (యూఎస్‌ఏ), రాజేశ్వర్ యాదవ్ (యునైటెడ్ కింగ్‌డమ్), షేక్ అఫ్సర్ అలీ, నరసింహయాదవ్, షేక్ నసర్ (కువైట్), షేక్ దర్బార్ (ఖతార్) తదితరులున్నారు. ఈ సందర్భంగా వారి వెంట పార్టీ ఎన్‌ఆర్‌ఐ విభాగం కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి ఉన్నారు.

అధినేతతో భేటీ



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన రమేష్‌గౌడ్

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

మహిళను కత్తులతో బెదిరించి బంగారు అపహరణ



ఘటనను పోలీసులకు వివరిస్తున్న బాధితురాలు లక్ష్మీదేవి

బెళుగుప్ప: ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళను కత్తులతో బెదిరించి బంగారు నగలు, నగదు అపహరించిన ఘటన సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలం రామసాగరం గ్రామానికి కిలోమీటర్ దూరంలో ఉన్న తోటలో తన కుమారుడు శ్రీనాథరెడ్డితో కలసి ముడిమి లక్ష్మీదేవి నివాసముంటోంది. సోమవారం రాత్రి కూరగాయలు తీసుకు వచ్చేందుకు శ్రీనాథ్ రెడ్డి రామసాగరం గ్రామానికి వెళ్లాడు. ఆ సమయంలో గదిలో లక్ష్మీదేవి వంట చేస్తుండగా ముగ్గురు ఆగంతకులు లోపలకు ప్రవేశించారు. వంట గదిలో ఉన్న లక్ష్మీదేవిని వెనుక నుంచి అదిమిపట్టి కిందపడేసి కత్తులతో బెదిరిస్తూ నోట్లోకి గుడ్డలు కుక్కారు. ఆమె శరీరంపై ఉన్న బంగారు చైను, చేతిలోని నాలుగు బంగారు గాజులు లాక్కొని, ఇంట్లో ఉన్న రూ.96వేల నగదును అపహరించారు. కొద్ది సేపటికి ఇంటికి చేరుకున్న కుమారుడు విషయం తెలుసుకుని గ్రామంలోకి వెళ్లి బంధువులకు, గ్రామస్తులకు తెలపడంతో చుట్టుపక్కల గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో మంగళవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు, ప్రొబేషనరీ డీఎస్పీ అష్రఫ్ అలీ, సీఐలు మహానంది, ప్రవీణ్‌కుమార్, విడపనకల్లు, వజ్రకరూరు ఎస్‌ఐలు ఖాజాహుస్సేన్, నాగస్వామి, బెళుగుప్ప ఎస్‌ఐ శివ పరిశీలించారు. స్నిఫ్పర్ డాగ్‌ను రంగంలో దించారు. క్లూస్ టీం సాయంతో నిందితుల వేలి ముద్రలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రైలులో దొంగతనం



చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు



బాధితురాలు విశాలాక్షి

గుత్తి/తాడిపత్రి రూరల్/ కడప కోటి రెడ్డిసర్కిల్: సాంకేతిక లోపం కారణంగా మార్గ మధ్యంలో నిలిచిపోయిన సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (ఎగ్మూర్ ఎక్స్‌ప్రెస్) రైలులో చోరీ జరిగింది. గుత్తి జీఆర్‌పీ ఎస్‌ఐ నాగప్ప తెలిపిన మేరకు... ముంబయి నుంచి చెన్నైకి బయలుదేరిన ఎగ్మూర్ ఎక్స్‌ప్రెస్ రైలు (22159) మంగళవారం తెల్లవారుజామున 4గంటలకు గుత్తి జీఆర్‌పీ పరిధిలోని కోమలి రైల్వేస్టేషన్ సమీపంలోకి చేరుకోగానే సిగ్నలింగ్‌లో తలెత్తిన లోపం కారణంగా పొలాల్లో నిలిచిపోయింది. ఆ సమయంలో ఎస్–1 భోగిలోని సీటు నంబర్ 17లో నిద్రిస్తున్న విశాలాక్షి మెడలోని మూడు తులాల బంగారు చైన్‌ను ఓ దుండగుడు లాక్కొని ఉడాయించాడు. గుత్తి ఆర్‌ఎస్‌లోని మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న విశాలాక్షి కడపలో జరుగుతున్న పరీక్షలకు ఎగ్జామినర్‌గా హాజరయ్యేందుకు గుత్తిలో తెల్లవారుజామున 3గంటలకు రైలు ఎక్కారు. తన మెడలోని బంగారు గొలుసు లాగగానే మేల్కొన్న ఆమె గట్టిగా కేకలు వేసినా ఫలితం లేకపోయింది. ఘటనపై బాధితురాలు కడప జీఆర్‌పీలో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న గుత్తి ఆర్‌పీఎఫ్ సీఐ రవిప్రకాష్, ఎస్‌ఐ కృష్ణ, జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు.

వృద్ధుడి ఆత్మహత్య

గార్లదిన్నె: మండలంలోని జంబులదిన్నె గ్రామానికి చెందిన పెద్దన్న (60) ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న ఆయన తరచూ కడుపు నొప్పిస్తుండడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం గార్లదిన్నె రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ట్రాక్ సిబ్బంది సమాచారంతో జీఆర్పీ ఎస్‌ఐ వెంకటేశులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

బీమా చట్టాల సవరణ బిల్లు వద్దు



ఎల్‌ఐసీ ఆఫీసు వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

హిందూపురం: కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేలా నిర్ణయాలు తీసుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలని ఎల్‌ఐసీ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, ఉద్యోగుల సంఘం హిందూపూర్ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బి.నరసింహులు పిలుపునిచ్చారు. సంఘం అధ్యక్షులు యల్.చంద్రకళ ఆధ్వర్యంలో స్థానిక ఎల్‌ఐసీ డివిజనల్ ఆఫీసు ఎదుట దేశవ్యాప్త పిలుపుమేరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో బీమా చట్టాల సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్నారని దాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎల్‌ఐసీలో ప్రభుత్వం తన వాటాలను ఉపసంహరించుకునే కార్యక్రమానికి మరోమారు ప్రయత్నించడం సరికాదన్నారు. ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో కొత్త పెన్షన్ విధానానికి స్వస్తిపలికి పాత పెన్షన్ విధానాన్ని అమలుకు సిద్ధపడుతున్నాయని చెప్పారు. ఎల్‌ఐసీలో కూడా అందరికీ పాత పెన్షన్ విధానమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు మధుసూదన్‌రావు, గంగాధర్, శ్రీలక్ష్మి, మాధురిబాయ్, మాధురిలత, జ్యోతిర్మయి, మాధవి, నాగారత్న, నాగరాజు, రామచంద్రప్ప, మనీష్ ప్రీతం, రవితేజ, పెన్షన్ యూనియన్ సభ్యులు నాగప్ప,నరసింహారెడ్డి పాల్గొన్నారు.

తండ్రిపై తనయుడి దాడి

గార్లదిన్నె: మండలంలోని ఇల్లూరులో తండ్రిపై తనయుడు దాడి చేశాడు. డబ్బు విషయంగా రామాంజనేయులుతో గొడవపడిన కుమారుడు మణికంఠ ఆవేశంతో కట్టె తీసుకుని దాడి చేయడంతో తండ్రి తకు బలమైన గాయమైంది. గమనించిన కుటుంబసభ్యులు దాడిని అడ్డుకుని క్షతగాత్రుడిని 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ గౌస్ మహమ్మద్‌బాషా తెలిపారు.

కల్వర్టుపై దూసుకెళ్లిన ప్రైవేటు బస్సు



కల్వర్టుపై నిలిచిపోయిన బస్సు

రాయదుర్గం టౌన్: మండలంలోని జుంజురాంపల్లి సమీపంలో ఓ ప్రైవేటు బస్సు అదుపు తప్పి కల్వర్టుపై దూసుకెళ్లింది. రోజూ మంగళవారం మధ్యాహ్నం బెళుగుప్ప నుంచి గుండ్లపల్లి, కెంచానపల్లి మీదుగా బెంగళూరుకు ఎస్‌ఆర్‌జే ప్రైవేటు బస్సు వెళుతుంది. ఈ నేపథ్యంలో మంగళవారం బెళుగుప్ప నుంచి బయల్దేరిన బస్సు జుంజురాంపల్లి సమీపంలోకి చేరుకోగానే కల్వర్టుపై దూసుకెళ్లి నిలిచిపోయింది. ఘటనలో ముగ్గురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

మెట్లపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

బత్తలపల్లి: మేడపైకి వెళ్లేందుకు మెట్లు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తూ జారి కిందపడటంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. కడప జిల్లా వేంపల్లి మండలం అయ్యవారిపల్లికి చెందిన కోనేటి సుధాకర్ (38) బతుకుదెరువు నిమిత్తం 11 ఏళ్ల క్రితం బత్తలపల్లికి వచ్చాడు. ఆర్డీటీ ఆస్పత్రి సమీపంలో టిఫెన్ హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 20న రాత్రి మిద్దెపై పడుకునేందుకు మెట్లు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారడంతో కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో భార్యతోపాటు స్థానికులు వెంటనే ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం.. అటు నుంచి కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దిగుబడి ఉన్నా.. ధర లేదన్నా!

- పడిపోయిన బీరకాయల ధరలు
- రైతులకు తీవ్ర నష్టం



కనగానపల్లిలో కట్టెల ద్వారా సాగుచేసిన బీర తోట

కనగానపల్లి: ఆరుగాలం కష్టపడి పనిచేసే రైతన్నకు నష్టాలే మిగులుతున్నాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట సాగు చేస్తే సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా ఉద్యాన పంటల పరిస్థితి అధ్వానంగా తయారైంది. బీరకాయలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

భారీగా పెట్టుబడులు

మండలంలోని పలు గ్రామాల్లో రైతులు బీర పంటను సాగు చేశారు. తక్కువ కాలంలో పంట చేతికి వచ్చే ఈ పంటను కనగానపల్లి, యలకుంట్ల, నరసంపల్లి, మామిళ్లపల్లి గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో రైతులు సాగు చేశారు. పందిరి, కట్టెల అల్లకం ద్వారా ఈ పంట సాగు చేయాలంటే ఎకరానికి రూ.లక్ష పైగా పెట్టుబడి వస్తుంది. దీంతో పాటు సాగులో విత్తనాలు, ఎరువులు కూలీల ఖర్చులు ఎక్కువగానే వస్తాయి. అయితే పంటకు వాతావరణం బాగా అనుకూలిస్తే ఎకరానికి 14 టన్నుల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు.

అమాంతం పడిపోయిన ధరలు..

రైతులు పంట సాగు చేసిన సమయంలో ధరలు బాగానే ఉన్నాయి. అయితే ఇటీవల అమాంతం పడిపోయాయి. అయితే మొదట టన్ను రూ.20 వేలకు పైగా ఉన్న బీర కాయల ధర ప్రస్తుతం మార్కెట్లో రూ.12 వేలకు పడిపోయాయి. రోజుల వ్యవధిలోనే దాదాపు రూ.8 వేలకు పైగా ధరలు తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తమకు పెట్టుబడి కూడా దక్కుతుందో లేదోనని వాపోతున్నారు. ప్రభుత్వం తమకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

పెట్టుబడి కూడా దక్కేలా లేదు..



రూ.4 లక్షల దాకా పెట్టుబడి పెట్టి రెండున్నర ఎకరాల్లో బీర పంట సాగు చేశా. పంట సాగు చేసిన తర్వాతా 40 రోజులకే పంట చేతికి వచ్చింది. ఇప్పటి వరకు మూడు కోతలకు 30 టన్నుల దాకా దిగుబడి వచ్చింది. అయితే మొదటిసారి రూ.20 వేలకు పైగా ఉన్న బీర కాయల ధర ప్రస్తుతం మార్కెట్లో రూ.12 వేలకు పడిపోయింది. దీంతో పంట దిగుబడి బాగున్నా గిట్టుబాటు ధర లేక పంట పెట్టుబడి కూడా దక్కేలా లేదు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– పెద్దకుళ్లాయప్ప, రైతు, కనగానపల్లి

క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీ అయిన ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వక్తలు బదిలీ అయిన ఉపాధ్యాయులు శ్రీనివాసమూర్తి, గురురాజ్, కృష్ణమూర్తి, మల్లేష్‌రెడ్డి, రామకృష్ణ, ఉమాదేవి, పద్మావతి, నిర్మల తదితరుల సేవలను వక్తలు కొనియాడారు. అనంతరం వారిని పూలమాలలు, శాలువాతో సత్కరించారు. పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులను క్రీడల్లో భాగస్వామ్యం చేయాలి

అనంతపురం: జర్నస్టులను క్రీడలలో భాగస్వామ్యం చేయాలని జే శాప్ లక్ష్యమని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా జే శాప్ (జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) కార్యవర్గ సమావేశాన్ని అనంతపురం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర కమిటీ సభ్యులు మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా కమిటీలను ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడిగా రేపటి. రామాంజినేయులు, జిల్లా అధ్యక్షుడిగా కోనంకి రవితేజ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్. చంద్రమోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా శివప్రసాద్‌ను ఎన్నుకున్నారు.

అర్హులందరికీ ‘తల్లికి వందనం’ అందేలా చూడండి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ బాలకృష్ణుడు

చెన్నేకొత్తపల్లి: అర్హులందరికీ ‘తల్లికి వందనం’ పథకం అందేలా చూడాలని ఎంపీడీఓ బాలకృష్ణుడు సచివాలయ సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండలంలోని సచివాలయ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ తల్లికి వందనం అందని వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. పథకం అందకపోవడానికి గల వారికి కారణాలను తెలుసుకుని సమస్య పరిష్కరించాలన్నారు.

డీఎల్‌పీఓ విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ శివకుమారి

చెన్నేకొత్తపల్లి: నాగసముద్రం పంచాయతీలో పంచాయతీ నిధుల దుర్వినియోగం జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై డీఎల్‌పీఓ శివకుమారి విచారణ చేపట్టారు. మంగళవారం స్థానిక సచివాలయానికి చేరుకుని రికార్డులను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శిని చంద్రికను అడిగి తెలుసుకున్నారు. విచారణ నివేదికను త్వరలో ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆమె తెలిపారు. సర్పంచ్ ఎం.సుధారాణి, ఈఓఆర్డీ అశోక్‌నాయక్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాసశివరాత్రి వేడుకలు



శివబాలయోగి ఆశ్రమంలో శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: జ్యేష్ఠ మాసం ముగింపు నేపథ్యంలో పలు శివాలయాల్లో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు మాస శివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, హెచ్చెల్సీకాలనీలోని సనకోట ముత్యాలమ్మ ఆలయం, మంజునాథస్వామి ఆలయం, శివబాలయోగి ఆశ్రమం తదితర చోట్ల మహాశివుడికి రుద్రాభిషేకాలు శాస్త్రోక్తంగా సాగాయి. ఆశ్రమ నిర్వాహకులు రత్నగిరి దేవరాజ్, అరవింద్ తదితరులు స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారి పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలందుకున్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి



గొల్లపల్లిలో పొలం బడి నిర్వహిస్తున్న ఏఓ కృష్ణ చైతన్య



మాట్లాడుతున్న ఏఓ జ్యోతికుమార్

రాప్తాడు: ఖరీఫ్ పంటల సాగులో రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏఓ కృష్ణ చైతన్య సూచించారు. మంగళవారం గొల్లపల్లి, ఎం.చెర్లోపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు పంటల సాగులో అధికారుల సూచనల మేరకు సాగు చేసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. వేరుశనగ, కంది సాగు చేసే రైతులు విత్తన శుద్ధి తప్పక పాటించాలన్నారు. అన్నదాత సుఖీభవ సంబంధించి ఈకేవైసీ పెండింగ్ ఉన్నవారు పూర్తి చేయించుకోవాలన్నారు. అనంతరం బోరు బావుల కింద సాగు చేసిన వేరుశనగ పంటకు ఆశించిన రైతులకు సూచనలు చేశారు. ఏఈఓలు సుజిత, రంజిత, వీపీఏ గౌస్ బాషా, ఎంపీఈఓ గంగరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో సూచనలు పాటించండి

ఆత్మకూరు: పంటల సాగులో రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు తప్పక పాటించాలని ఏఓ జ్యోతికుమార్ తెలియజేశారు. మంగళవారం తలుపూరు, పి.యాలేరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో భాగంగా వేరుశనగ విత్తనాలు వేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ట్రైకోడర్మా విరిడి కేజీ వేరుశనగ విత్తనానికి 8 గ్రాములు చొప్పున కలుపుకొని విత్తన శుద్ధి చేసుకోవడం వల్ల చీడ పీడలను నివారించవచ్చన్నారు. మట్టి పరీక్షలు ఆధారంగా ఎరువులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు రాము, అక్కమ్మ, ఎంపీఈఓ భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలు, రైతులపై దుర్మార్గ వైఖరి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతు కూలీ సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: రాష్ట్రంలో ఏజెన్సీ, పోలవరం నిర్మాణ ప్రాంతంలో నిర్వాసితులైన ఆదివాసి గిరిజనులు, రైతులను ఆదుకునే విషయంలో ప్రభుత్వం దుర్మార్గ వైఖరిని అవలంభిస్తోందని రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.చంద్రశేఖర్ మండిపడ్డారు. పోలవరం నిర్వాసితులకు భూమి, అడవి సంపూర్ణ పునరావాసం కల్పించాలంటూ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాలన్నారు. గ్రామాలు ఖాళీ చేసేనాటికి వయసు 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలన్నారు. వీలిన మండలాలతో సహా నిర్వాసితులందరికీ, డి–పట్టా సాగుచేస్తున్న ఆదివాసీలకు పూర్తి పరిహారం ఇవ్వాలన్నారు. అనంతరం డీఆర్ఓ ఎ.మలోలను నాయకులు ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేసిశారు. సంఘం ఉపాధ్యక్షుడు ఓబుళేసు, కార్యదర్శి దస్తగిరి, సహాయ కార్యదర్శి రామాంజనేయులు, కోశాధికారి పార్వతి, స్త్రీ విముక్తి సంఘటన నేతలు వెంకటలక్ష్మి, ప్రమీల, రాధమ్మ, ఏఐఎఫ్‌టీయూ నాయకులు సుధాకర్, ఓబుళేసు పాల్గొన్నారు.

రైతులకు మామిడి మొక్కల పంపిణీ



మామిళ్లపల్లిలో రైతులకు మామిడి మొక్కలు అందిస్తున్న దృశ్యం

కనగానపల్లి: పీఎన్‌పీ అగ్రోఫారెస్ట్రీ కార్బన్ ప్రాజెక్టు ద్వారా మండలంలోని రైతులకు ఉచితంగా మామిడి మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు ఆ ప్రాజెక్టు మేనేజర్ వంశీ సందీపం తెలిపారు. ముక్తాపురం, మామిళ్లపల్లి గ్రామాల్లోని రైతులకు మంగళవారం ఆ ప్రాజెక్టు ప్రతినిధులు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో వ్యవసాయ భూముల్లో స్థిరమైన అగ్రోఫారెస్ట్రీ పద్ధతుల ద్వారా పండ్ల మొక్కలను సాగు చేయిస్తున్నామన్నారు. ఇందుకోసం ఈ కార్బన్ ప్రాజెక్టు ద్వారా రైతులకు ఉచితంగా పండ్ల అందజేస్తున్నామన్నారు. కనగానపల్లి మండలంలో 10 గ్రామాల్లో రైతులు సుమారు 3 వేల ఎకరాల్లో మామిడి మొక్కలు నాటేందుకు ముందుకు వచ్చారన్నారు. వీరందరికీ మేలు రకమైన మామిడి మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు ప్రతినిధి మధు, రైతులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంలో వరుస చోరీలు



బీరువాలో వస్తువులను చెల్లా చెదురుగా పడేసిన దొంగలు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలో పట్ట పగలే దొంగలు పడి దోచుకుంటున్నారు. స్థానిక శంకరప్ప తోట వీధిలో నివాసముంటున్న సుధీర్ ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. సుధీర్ స్థానిక గ్రోమోర్ ఫర్టిలైజర్స్ కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఇతని భార్య అనంతపురానికి వెళ్లింది. విషయం గమనించిన దొంగలు.. ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలోని రూ.40 వేల నగదు, నాలుగున్నర తులాల నల్లపూసల దండ, బ్రాస్‌లెట్ రెండున్నర తులాలు, మెడ చైన్ 3 తులాలు, చిన్న చైన్ ఒకటిన్న తులం, 4 చేతి ఉంగరాలు 3 తులాలు, 3 జతల కమ్మలు 3 తులాలు, బుట్ట కమ్మలు ఒకటిన్నర తులం, గోల్డ్ కాయిన్స్ ఒకటిన్నర తులం చోరీ ఎత్తుకెళ్లారు. బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్టలో సైతం ఓ మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు బైకులో వచ్చి లాకెళ్ళారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వరుస చోరీలపై పట్టణ సీఐ యువరాజ్ మాట్లాడుతూ ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లోని వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. చోరీల నివారణకు ప్రత్యేక టీంతో నిఘాఉంచామన్నారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామన్నారు.

తేలుకాటుతో వ్యక్తికి అస్వస్థత

గుత్తి రూరల్: మండలంలోని పి.ఎర్రగుడి గ్రామంలో మంగళవారం కదిరప్ప అనే వ్యక్తికి తేలు కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కదిరప్ప తన ఇంటి సమీపంలో ఉన్న గుడిసె పైనున్న గడ్డిని తొలగిస్తున్నాడు. ఈ సమయంలో గడ్డిలో ఉన్న విషపూరితమైన ఎర్ర తేలు కుడి చేతి వేళ్లకు కాటువేసింది. కుటుంబసభ్యులకు అతడిని వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డు మరమ్మతు



పండమేరు వంకపై కొట్టుకు పోయిన రహదారి (ఫైల్)



రోడ్డు మరమ్మతు చేయించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడు: భారీ వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డును మంగళవారం మరమ్మతు చేయించారు. వివరాలు.. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు రాప్తాడు సమీపంలోని పండమేరు వంక్గపై ఉన్న రహదారి కొట్టుకుపోయింది. రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్డు మొత్తం బురద మయంగా ఉండటంతో ఈ రహదారిపై వెళ్తున్న ద్విచక్ర వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దాదాపుగా ఈ రస్తాపై ద్విచక్ర వాహనాదారులు జారీ కింద పడి గాయాలపాలయ్యారు. ‘రోడ్డు గుంతల మయం...ప్రయాణం నరకం’ శీర్షికన కథనాన్ని సాక్షిలో గత నెల 20న ప్రచురితమైంది. స్పందించిన సర్పంచు సాకే తిరుపాల్ రోడ్డును మరమ్మతు చేయించారు. రోడ్డు సమస్యను పరిష్కరించిన సర్పంచు సాకే తిరుపాల్‌తోతపాటు సాక్షికి ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబువి దిగజారుడు రాజకీయాలు



మాట్లాడుతున్న ఎస్సీసెల్ నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: సీఎం చంద్రబాబు తన స్వార్థం కోసం దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎల్ రాఘవ మండిపడ్డారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా జరిగిన ప్రమాదంలో సింగయ్య అనే వ్యక్తి మృతి చెందాడన్నారు. అయితే అతడు వైఎస్ జగన్ వాహనం కింద పడి మృతి చెందినట్లు ఏఐ టెక్నాలజీ ద్వారా సృష్టించడంతోపాటు ఏకంగా వాహన డ్రైవర్‌తో పాటు ఏ2గా వైఎస్ జగన్, మరో నలుగురిపై కేసు నమోదు చేయడం దారుణమన్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసేటప్పుడు డ్రైవర్ యాక్సిడెంట్ చేస్తే బస్సులో ప్రయాణికులపై కూడా కేసులు నమోదు చేస్తారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజా సంక్షేమం మరిచి కక్షసాధింపు చర్యలు చేసడుతున్నారని ఇది సరైంది కాదన్నారు. ఇప్పటికైనా ఇగజారుడు రాజకీయాలు మాని మంచి పరిపాలన చేయాలని హితవు పలికారు. లేని పక్షంలో ప్రజలు కూటమి ప్రభుత్వంపై తిరగపడే రోజులు వస్తాయని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మాజీ నగర అధ్యక్షుడు సాకే శివశంకర్, నాయకులు బండారు పెద్దన్న, సాకే బాలచంద్ర పాల్గొన్నారు.

ప్రొఫెసర్ శశిధర్ నియామకంపై హర్షం

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) సభ్యులుగా జేఎన్‌టీయూ అనంతపురం మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి శశిధర్ నియామకం పట్ల మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అనంతపురంలోని మాదిగ ఉద్యోగుల సమాఖ్య కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ మాట్లాడుతూ ప్రతిభావంతులను ఉన్నత ఉద్యోగులుగా నియామకం చేసే ప్రతిష్టాత్మక ఏపీపీఎస్సీ సభ్యులుగా మాదిగ సామాజికవర్గానికి చెందిన శశిధర్‌కు అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. శశిధర్ రిజిస్ట్రార్‌గా, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్‌గా పనిచేశారని ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యల్లప్ప గారి గంగాధర్, జాతీయ కార్యవర్గ సభ్యులు సాకే అమర్‌నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు మన్నెపాకుల రమేష్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బండారు కదిరప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణ, ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బండారు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కసాపురంలో మన్యుసూక్త హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం మన్యుసూక్త హోమం ఘనంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు ఆలయ యాగశాలలో స్వామివారి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రాచ్చారణల మధ్య మన్యుసూక్త హోమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈఓ వాణి, భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

పుట్లూరు: పాత్రికేయులపై దుర్భాషలాడిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు సీఐ సత్యబాబు, ఎస్ఐ వెంకట నరసింహ తెలిపారు. వివరాలు.. మండలంలోని చింతకుంట కాలభైరవస్వామి ఆలయ అర్చకుడు సూర్యకుమార్‌మూర్తిపై దేవదాయ శాఖ ఈఓ మురళీ కృష్ణ దుర్భాషలాడిన ఆడియో వైరల్‌గా మారిన విషయం విదితమే. ఈ విషయాన్ని పలు పత్రికల్లో ఈ నెల 22న ప్రచురించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ చింతకుంట గ్రామానికి చెందిన ఇంద్రసేన పాత్రికేయులను దుర్భాషలాడాడు. అర్చకుల్లో ఉన్న విభేదాల కారణంగా పాత్రికేయులపై రెచ్చిపోయిన ఇంద్రసేన దుర్భాషలాడిన వీడియోను వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నాడు. ఇంద్రసేనపై పుట్లూరు మండల విలేకర్లు సీఐ సత్యబాబు, ఎస్ఐ వెంకట నరసింహులుకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: కొత్తపేట గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. టి.కొత్తపల్లికి చెందిన ఓబులేసు గుత్తిలో పని ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా కొత్తపేట గ్రామ శివారులో గుత్తి వైపు వస్తున్న లారీ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రజా సమస్యలపై ఉద్యమాలు

అనంతపురం అర్బన్: నగరంలో ప్రజాసమస్యలపై ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఐ నగర కమిటీ ప్రకటించింది. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నగర కార్యదర్శి శ్రీరాములు విలేకరులతో మాట్లాడారు. గుత్తిరోడ్డులోని డంపింగ్ యార్డ్‌ను అక్కడి నుంచి మార్పు చేసేలా ప్రజాప్రతినిధులను నిలదీస్తామన్నారు. భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు పోరాటం సాగిస్తామన్నారు. ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచస్తూ నెలసరి ఆదాయం రూ.20 లోపు ఉన్నవారికి సూపర్‌సిక్స్ అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిని వెయ్యిపడకలకు పెంచేలా ఉద్యమిస్తామన్నారు.

108 మందితో నగర నూతన సమితి

మహాసభలో సీపీఐ నగర నుతన సమితిని ఎన్నుకున్నారు. మొత్తం 108 మందితో నూతన సమితి ఏర్పాటైంది. నగర కార్యదర్శిగా శ్రీరాములు, సహాయ కార్యదర్శులుగా బి.రమణ, వి.కె.కృష్ణుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా అల్లీపీరా, ఎల్లుట్ల నారాయణస్వామి, ఈడిగ ప్రసాద్, శ్రీనివాసులు తదితరులను ఎన్నుకున్నారు.

కలెక్టర్‌కు యోగా గురువుల అభినందనలు

అనంతపురం కల్చరల్: వివేకానంద యోగా కేంద్రం, యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ వారు జిల్లా కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఎక్కడానికి అధికమంది దివ్యాంగుల భాగస్వామ్యం చేయడం ద్వారా రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు అనంతకు వచ్చిందని వివేకానంద యోగా కేంద్రం అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి ఇతర సభ్యులు తెలియజేశారు. రాష్ట్ర చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోయేలా భవిష్యత్తులో తమ కేంద్రం సహాయ సహకారాలందిస్తుందని తెలిపారు.

గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా నిర్మలాబాయి



అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా నిర్మలా బాయి నియమితులయ్యారు. ఇటీవల నంద్యాల నుంచి బదిలీపై ఆమె అనంతపురం సర్వజనాస్పత్రికి వచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం స్టాఫ్‌నర్సు, హెడ్‌నర్సులు ఆమెకు పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. రోగులకు మెరుగైన సేవలదించడానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలన్నారు.

జూలై 5న జాతీయ లోక్ అదాలత్

రాయదుర్గంటౌన్: స్థానిక సివిల్ జడ్జి కోర్టులో జూలై 5న మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు న్యాయ సేవా అధికారి సంస్థ చైర్మన్, జడ్జి ఎం.రమ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కోర్టు ఆవరణలో 5న ఉదయం 10.30 గంటలకు జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. రాజీపడదగిన క్రిమినల్ కేసులు, సివిల్, కోర్టులో పెండింగ్ ఉన్నవి, పెండింగ్ లేని సమస్యల పరిష్కరించనున్నట్లు తెలిపారు. కేసుల పరిష్కారానికి న్యాయవాది ద్వారా గానీ లేదా మండల న్యాయ సేవా సమితినిగానీ సంప్రదించి, పరిష్కరించుకోవచ్చన్నారు.

పుస్తకాల పఠనంతో మేధోశక్తి పెంపు

కూడేరు: పుస్తకాలు చదవడంతో మేధోశక్తి పెరుగుతుందని ఎంఈఓ–2 సాయికృష్ణ తెలిపారు. మంగళవారం కూడేరులోని ఎమ్మార్సీలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు లైబ్రరీ పుస్తకాలను అందజేశారు. పిల్లలు ఖాళీ సమయంలో కాలాన్ని వృథా చేయకుండా లైబ్రరీ పుస్తకాలు చదువుకునేలా చర్యలు చేపట్టాలని ఆయన హెచ్ఎంలకు సూచించారు. హెచ్ఎంలు, సీఆర్పీ రమణ, ఎమ్మార్సీ సిబ్బంది ఆంజనేయులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన ధనుంజయయాదవ్



వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కె.ధనుంజయయాదవ్ తన కుమారుడు కె. సాయి హొత్రజ్ఞ యాదవ్ కలిశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ పటిష్టతకోసం కృషి చేయాలంటూ వైఎస్ జగన్ సూచించారు.

– రాప్తాడురూరల్